RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 461 | 30 ఆదివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




## ఓటర్ల తొలగింపుపై సీఈసీకి

# సీఎం రేవంత్ రెడ్డి లేఖ

### : గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి



తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ా×=) ప్రక్రియపై కేంద్ర ఎన్నికల కమిషనర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు.దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను (ERO\T) తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## 22ఏ భూముల సమస్యలపై పోరుబాట

### : బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాంచందర్ రావు కీలక భేటీ



తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## ఏపీ, తెలంగాణలో వర్షాలు..

### పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు వివరించారు.తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండి, నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు.

## కేబినెట్‌లో మార్పులు అవసరం

### : గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వం పనితీరులో నూతనోత్తేజం వస్తుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను అరికట్టి, క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు.ప్రస్తుతం రాజకీయ పార్టీలలో క్రమశిక్షణ కొరవడిందని గుత్తా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలోని గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సీనియర్ నేత చిన్నారెడ్డి పార్టీ నియమావళిని అతిక్రమించి మాట్లాడటం సరికాదని, హద్దులు దాటే వారిపై చర్యలు తీసుకోకపోతే పార్టీకే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం, పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో సమాచార లీకేజీలను అదుపు చేయాలని ఆయన కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని, ఆయనకు ఎటువంటి ఆటంకాలు సృష్టించకుండా స్వేచ్ఛగా పనిచేసే అవకాశం కల్పించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి హితవు పలికారు. ప్రస్తుతం ప్రభుత్వంపై సామాన్య ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూనే, ప్రభుత్వం నూతన పథకాలను అమలు చేస్తోందని, అయితే ప్రభుత్వ కార్యక్రమాలకు మరింత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంక్షేమ పథకాలపై స్పందిస్తూ, ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లను రూ. 3,000కు పెంచాలని, 22ఏ నిబంధనను రద్దు చేసి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ఉచిత పథకాలను క్రమంగా తగ్గించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో టీచర్లకు

# ప్రత్యేక టెట్



తెలంగాణలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది.ఈ ప్రత్యేక టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9:00 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:30 వరకు వివిధ సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. సెప్టెంబర్ 8న పేపర్-1, పేపర్-2 (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9వ తేదీన మిగిలిన మాధ్యమాలకు సంబంధించిన పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.ప్రభుత్వ, సంబంధిత పాఠశాలల్లో పనిచేస్తూ, ఇప్పటికీ నిర్దేశిత అర్హత ప్రమాణాలను సాధించని ఉపాధ్యాయుల కోసమే ఈ ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లు, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ schooledu.telangana.gov.in సందర్శించాలని విద్యాశాఖ సూచించింది.

## ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీడ్రాలో ప్రోటోకాల్ రగడ..

### - అధికారులపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం



ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ/గృహలక్ష్మి ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వజమెత్తారు. తాను రాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రారంభించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన రాకముందే అధికారులు ప్రక్రియను ప్రారంభించడంతో తీవ్ర అసంతృప్తికి గురైన దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు.ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా, ప్రోటోకాల్ పాటించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని దానం నిలదీశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అలిగి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

## ఓ మాజీ మంత్రి కోడలిని

# మతం మారమన్నారు

### : సీఎం చంద్రబాబు



గత ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిడులు జరిగాయని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఓ మాజీ మంత్రి ఇంట్లోనే మత మార్పిడికి ఒత్తిడి జరిగిందని, ఆయన కోడలే ఈ విషయాన్ని బయటపెట్టిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అరకు పర్యటనలో 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఒక మాజీ మంత్రి కోడలు బయటకు వచ్చి, తనను ఇంట్లో మతం మారమని ఒత్తిడి చేస్తే తాను గట్టిగా నిరాకరించానని చెప్పింది. బయట హిందువులుగా చలామణి అవుతూ ఇంట్లో ఇలాంటి పనులు చేశారు. ఇది చాలా తప్పు. విశ్వాసం అనేది వ్యక్తిగతం, కానీ దాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దడం దుర్మార్గం" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గత పాలనలో జరిగిన కొన్ని ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరిగాయని, ఆ పార్టీలో ఉండాలంటే మతమే ఒక కనీస అర్హతగా మార్చే పరిస్థితి తీసుకొచ్చారని చంద్రబాబు ఆరోపించారు. బలవంతపు మత మార్పిడులు మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. ఇటువంటి చర్యల వల్లే ప్రజలు గత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు.ఇటీవల మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేశ్ కోడలు మేఘన మీడియా ముందుకు వచ్చి సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# పింగిళి కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజలు మాట్లాడే భాషకు గౌరవం కల్పించేందుకు గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో మధురమైనదని అన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి మన నిజమైన సంపద అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ కవులు, రచయితలు రచించిన విలువైన పుస్తకాలను విద్యార్థుల ప్రయోజనార్థం కళాశాల తెలుగు విభాగానికి అందజేశారు. కళాశాల తెలుగు విభాగాధిపతి సందుపట్ల మధు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, ప్రజలు మాట్లాడే వ్యావహారిక తెలుగు భాషకు ప్రాధాన్యత కల్పించేందుకు గిడుగు రామమూర్తి పంతులు చేసిన ఉద్యమం ఎంతో గొప్పదని అన్నారు. విలువైన పుస్తకాలను తెలుగు విభాగానికి అందజేసిన నిమ్మల శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలియజేసారు. తెలుగు అధ్యాపకులు డా. లక్ష్మీకాంతం, డా. రత్నమాల తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగు సాహిత్య వైభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు తెలుగు భాష విశిష్టతను తెలియజేస్తూ స్వయంగా రచించిన కవితలను పఠించగా వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాశాలకు విలువైన పుస్తకాలను అందించిన నిమ్మల శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో ఐ క్యూ ఏ సి కో ఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అధ్యాపకులు డా. మమత, డా. యుగంధర్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నీట్ పీజీకి పటిష్ట భద్రత.. పరీక్ష కేంద్రాల చుట్టూ 200 మీటర్ల మేర ఆంక్షలు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

రంగారెడ్డి: నీట్ పీజీ2026 ప్రవేశ పరీక్షను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భవిష్యత్ నగర కమిషనరేట్ పోలీసులు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. ఆగస్టు 30న నిర్వహించనున్న ఆన్‌లైన్ పరీక్షకు సంబంధించి పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ప్రత్యేక ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు వెల్లడించారు. పరీక్ష జరిగే రోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ప్రజలు గుమిగూడకుండా నిషేధాజ్ఞలు విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద రద్దీని నియంత్రించడం, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటం, పరీక్షా నిర్వహణలో ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ఈ ఆంక్షల ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. భారతీయ నాగరిక సురక్షా సంహిత. (దీచీూ)2023లోని సెక్షన్ 163 ప్రకారం ఈ ఆదేశాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, సైనికులు, హోంగార్డులకు మాత్రం ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుంది. పరీక్ష కేంద్రాల సమీపంలో అనవసరంగా సంచరించడం, గుంపులుగా చేరడం వంటి చర్యలకు పాల్పడవద్దని అధికారులు సూచించారు. ఆంక్షలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భవిష్యత్ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, ఐపీఎస్ హెచ్చరించారు. పరీక్షార్థులు సమయపాలన పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.




# నిర్మాణ అనుమతుల్లో పేదలకు అన్యాయం వద్దు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

ఆదిభట్ల: ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో నిబంధనల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో రాగన్నగూడలోని జీహెచ్‌ఎంసీ ఆదిభట్ల సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ తొర్రూర్, తుర్కయంజాల్, కొంగరకలాన్, ఆదిభట్ల ప్రాంతాల్లోని పలు గ్రామాలు ఇప్పటికీ గ్రామీణ స్వభావాన్ని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. 1974, 1984కు ముందే ఏర్పడిన లేఅవుట్లకు ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్, కన్జర్వేషన్ జోన్ తదితర నిబంధనలను కారణంగా చూపుతూ నిర్మాణ అనుమతులు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా 18 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న ప్లాట్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామకంఠం భూముల విషయంలోనూ అధిక ఫీజులు, అనవసర నిబంధనలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ భూముల్లో ప్రైవేట్ సర్వే నంబర్ల ముసుగులో నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కిషన్ హెచ్చరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# బుద్ధవనాన్ని సందర్శించవలసిందిగా ఫిలడెల్ఫియా బౌద్ధాచార్యులకు విజ్ఞప్తి

## - ప్రత్యేకతలను వివరించిన శివనాగిరెడ్డి

ఫిలడెల్ఫియా/నందికొండ, ఆగస్టు, 29:

తెలంగాణ రాష్ట్రంలో నాగార్జునసాగర్ వద్ద పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బౌద్ధ వారసత్వ థీమ్ పార్క్, బుద్ధ వనాన్ని సందర్శించవలసిందిగా ఫిలడెల్ఫియా నగరంలోని బౌద్ధాచార్యులకు విజ్ఞప్తి చేసినట్లు, బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. స్థానిక బౌద్ధాభిమాని రవికుమార్ రెడ్డి లట్టుపల్లి చొరవ, సహకారంతో శనివారం నాడు ఆయన అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని ఫిలడెల్ఫియా నగరంలో ఉన్న మోంగ్ కుల్ తెప్ మునీ బౌద్ధ విహార, ఫొషో బౌద్ధలయం, వాట్ ఖ్మేర్ పలెలై, ఫ్ర బుద్ధ రన్సీ, కతంప ధ్యాన కేంద్రం, లియాన్ షెంగ్ ట్రూ బుద్ధ టెంపుల్, వొన్ బౌద్ధాలయాలను ఆయన సందర్శించి, ఆయా బౌద్ధాలయ ఆచార్యులకు నాగార్జునకొండ, బుద్ధవనం ఇంకా తెలంగాణలోని ప్రసిద్ధ బౌద్ధారామాల ప్రత్యేకతలను వివరించగా, వారు భారతదేశ పర్యటనలో భాగంగా బుద్ధవనాన్ని సందర్శిస్తామన్నారని శివనాగిరెడ్డి తెలిపారు.



# మంచాలలో అభివృద్ధి జోరు.. పల్లెల్లో ఎమ్మెల్యే రంగారెడ్డి సుడిగాలి పర్యటన

**హైదరాబాద్ స్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

**మంచాల:** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ మంచాల మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. శనివారం మంచాల మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి సుమారు రూ.2.07 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. లింగంపల్లిలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. మహిళల సమస్యలను అడిగి తెలుసుకుని, అంగన్‌వాడీ సబ్‌సెంటర్ అవసరంపై వివరాలు సేకరించారు. అనంతరం తాళ్లపల్లిగూడలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. తిప్పాయిగూడలో రూ.7 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించి, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహిళల కోసం డ్వాక్రా భవనం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. చిత్తాపూర్‌లో పంచాయతీ భవనానికి భూమిపూజ చేసి, రూ.5 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. జాపాలలో రూ.20 లక్షల పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేయగా, లబ్ధిదారుల ఆహ్వానం మేరకు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్నారు. కొర్రవానితండా, రంగాపూర్‌లలోనూ అభివృద్ధి పనులను ప్రారంభించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాత్రి వరకు ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించారు. ఎల్లమ్మతండాలో నిర్వహించిన వీరాంజనేయస్వామి, గణపతి, నాగదేవత విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ఆలయ ప్రహారీ గోడ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.



# పెంజర్లపై అదనపు కలెక్టర్ ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

**కోతూరు:** గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి అధికారులను ఆదేశించారు. శనివారం కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పంచాయతీలో ఆమె విస్తృతంగా పర్యటించి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణ, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించిన అదనపు కలెక్టర్ వాటి నిర్వహణపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీల్లోని మొక్కల సంరక్షణ, పల్లె ప్రకృతి వనంలో పచ్చదనం పెంపొందించే చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మొక్కలకు అవసరమైన నీరు, సంరక్షణ అందిస్తూ వాటి పెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్న తీరును పరిశీలించడంతో పాటు చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిరంతరాయంగా కొనసాగించాలని, ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని డాక్టర్ కిరణ్మయి ఆదేశించారు.



# కిరాణా షాపులో మద్యం విక్రయాలపై ఫిర్యాదు.. "తనిఖీలకు వెళ్లిన పోలీసులతో వాగ్వాదం"

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

**ఇబ్రహీంపట్నం:** కిరాణా షాపు ముసుగులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలకు వెళ్లిన పోలీసులను అడ్డుకోవడంతో పాటు దుర్భాషలాడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కే. లింగేశ్వర్, హోంగార్డ్ కే. శ్రీనివాస్‌లు ఈ నెల 28న పెట్రోలింగ్ మొబైల్-1లో విధుల్లో ఉన్నారు. ఉదయం సుమారు 9 గంటల సమయంలో పోచారం గ్రామంలో ఓ కిరాణా షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారంటూ డయల్-100కు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి షాపును తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా.. షాపు నిర్వాహకుడు పల్లె కిరణ్‌గౌడ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో సుమారు 40 కిరాణా షాపులు ఉన్నాయని, తమ షాపునే ఎందుకు తనిఖీ చేస్తున్నారని ప్రశ్నిస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపించారు. అంతేకాకుండా పోలీసులను దుర్భాషలాడుతూ తనిఖీలను అడ్డుకున్నారని కానిస్టేబుల్ లింగేశ్వర్ ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.



# ఓటర్ల సవరణకు వేగం పెంచాలి

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

**రంగారెడ్డి:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు మరింత వేగంగా పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, విచారణ, ఆధారాల పరిశీలన తదితర అంశాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత వ్యక్తులకు త్వరితగతిన అందజేసి, నోటీసు అందిన ఏడు రోజుల తర్వాత నిబంధనల ప్రకారం విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. అనామలీస్, నో మ్యాపింగ్ జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల సమయంలో సమర్పించాల్సిన పత్రాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ూ×= విధుల్లో కొత్తగా చేరిన సిబ్బందికి సోమవారం వరకు శిక్షణ పూర్తి చేసి, బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో విధులు చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఏఈఆర్‌ఓ కార్యాలయాల పరిధిలో సిబ్బందికి క్లస్టర్ వారీగా బాధ్యతలు అప్పగించి, అవసరమైన చోట అదనపు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మండల స్థాయి వరకు పనులను సమన్వయం చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# ప్రైమ్ కేర్‌లో నర్స్ అనుమానాస్పద మృతి

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

**తుక్కుగూడ:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో నర్స్ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న శిరీష మృతి చెందడంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. శిరీష మృతికి గల కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటూ, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై ఆరా తీస్తున్నారు. మృతికి దారితీసిన పరిస్థితులపై ఆధారాలు సేకరిస్తున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు శంషాబాద్ డీసీపీ రాజేష్ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పోలీసుల దర్యాప్తులో శిరీష మృతికి అసలు కారణం వెలుగులోకి రావాల్సి ఉంది. ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.



RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి..

### - హనుమకొండను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు
### - క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు
### - వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

హనుమకొండ: విద్య, వైద్యం, క్రీడారంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో క్రీడా మౌలిక వసతులను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు.

శనివారం హనుమకొండలో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టేడియంను ప్రారంభించారు.

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్, హనుమకొండ జేఎన్ఎస్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వరంగల్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.

గత రెండున్నరేళ్లలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో విద్య, వైద్యం, క్రీడలు, మౌలిక వసతులు తదితర రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. జేఎన్ఎస్‌లో క్రీడాకారుల కోసం కల్పించిన ఆధునిక సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు సూచించారు.

క్రీడాకారులకు అవసరమైన మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే ఉన్న ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వరంగల్ ప్రాంతం క్రీడాకారులకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిందని, ఇక్కడి నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ప్రస్తుత తరం క్రీడాకారులు కూడా క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

క్రీడల్లో సాధించే ప్రతి విజయం క్రీడాకారుడి వ్యక్తిగత విజయమే కాకుండా కుటుంబానికి, ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో హనుమకొండ జిల్లా పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన రోజే తమకు నిజమైన బహుమతి అని అన్నారు.

రాజకీయంగా విమర్శలు చేసే ముందు గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును ప్రజలు బేరీజు వేసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత



రెండున్నరేళ్లలో వరంగల్ ప్రాంత అభివృద్ధికి అనేక కీలక ప్రాజెక్టులను తీసుకువచ్చామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు, రింగ్ రోడ్, విమానాశ్రయం తదితర అంశాల్లో ముందడుగు పడిందని పేర్కొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్, ఎస్టీపీల ఏర్పాటు, భూసేకరణ తదితర ప్రక్రియలను ముందుకు తీసుకెళు తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులకు భూసేకరణపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

వరంగల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గత రెండున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్లముందే కనిపిస్తోందని ఎమ్మెల్యే అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో వరంగల్ ప్రాంతానికి వచ్చిన నిధులు, ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన నిధులను ప్రజలు పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు.

మీరు రూ.20 కోట్లు తీసుకువస్తే, మేము రూ.80 కోట్లు తీసుకువచ్చాం. ఎవరు ఎంత అభివృద్ధి చేశారో ప్రజలే నిర్ణయిస్తారు అని అన్నారు.

కేవలం విమర్శలు చేయడం, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల ద్వారా దుష్ప్రచారం చేయడం వల్ల అభివృద్ధి జరగదని, ప్రజల కోసం నిధులు తీసుకురావడం, పనులు ప్రారంభించి పూర్తి చేయడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు.

ఉద్యోగులకు సంబంధించిన కొన్ని సమస్యలు ఇంకా పరిష్కరించాల్సి ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వాటిని తీసుకెళ్లామని, ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

వరంగల్ ప్రాంతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. వరంగల్‌కు మరింత విస్తృతమైన పరిపాలనా, అభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటే ఈ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

గత రెండున్నరేళ్లలోనే ఇంత అభివృద్ధి సాధించాం. భవిష్యత్తులో మరింత బలమైన పరిపాలనా వ్యవస్థ, కార్పొరేషన్ వంటి అవకాశాలు అందుబాటులోకి వస్తే వరంగల్‌ను ఏ స్థాయిలో అభివృద్ధి చేయవచ్చో ప్రజలు ఆలోచించాలి అని అన్నారు.

అభివృద్ధి అనేది మాటల్లో కాదు, చేతల్లో కనిపించాలి. గత రెండున్నరేళ్లలో ఏం జరిగిందో ప్రజల కళ్లముందే ఉందని, చేసిన పనులే తమకు సమాధానమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన అనంతరం స్పోర్ట్స్, స్విమ్మింగ్ అకాడమీ క్రీడాకారులు స్విమ్మింగ్ చేస్తుండగా ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, ఏసీపీ జితేందర్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బ్యాడ్మింటన్ ఆడారు.

ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారులు రమణయ్య, కైలాసంలను ఎమ్మెల్యే, కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యపై బిఆర్ఎస్ శంఖారావం





**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 29:-**

రంగారెడ్డి జిల్లా: ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా "సమరశంఖారావం" కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగుల సంక్షేమం, వారికి అందాల్సిన హక్కులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ బీఆర్ఎస్ నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లతో కలిసి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు, అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దివ్యాంగుల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దివ్యాంగుల సంక్షేమానికి బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ, వారి సమస్యల పరిష్కారం కోసం పార్టీ తరఫున నిరంతరం పోరాటం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి, హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయగిరి ప్రసాద్ సేవలు ఆదర్శనీయం

### - 30 ఏళ్ల విద్యా సేవలకు ఘన సత్కారం..
### - పదవీ విరమణ వేడుకలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

**గీసుగొండ, ఆగష్టు 29 హైదరాబాద్ ఎస్టేట్:**




విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల ప్రగతికి మూడు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందించిన మనుగొండ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు విజయగిరి ప్రసాద్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా శనివారం పాఠశాల ప్రాంగణంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, మనుగొండ గ్రామ సర్పంచ్ పేర్ల శ్రవణ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 30 ఏళ్లపాటు విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన విజయగిరి ప్రసాద్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. విజయగిరి ప్రసాద్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు ఆయన చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని అంకితభావంతో నిర్వహించి, సహచర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన విశ్రాంతి జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు తుప్పరి ఉదయ్‌శంకర్, గుర్రం మనోజ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయగిరి ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# నాలి సమ్మయ్య సేవలు చిరస్మరణీయం

### - ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించిన గొప్ప వ్యక్తి : మడే పూర్ణిమ

**తాడ్వాయి, ఆగష్టు 29 హైదరాబాద్ ఎస్టేట్:**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం చింతలగుంపునరసాపూర్ గ్రామంలో ఆదివాసీ పెద్ద నాలి సమ్మయ్య దశదినకర్మ శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ ముఖ్యఅతిథిగా హాజరై నాలి సమ్మయ్యకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మడే పూర్ణిమ మాట్లాడుతూ.. నాలి సమ్మయ్య ఆదివాసీ పెద్దగా సమాజానికి విశేష సేవలు అందించారని అన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాటిని భావితరాలకు అందించడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. సమాజం పట్ల నిబద్ధతతో పనిచేసిన ఆయన వ్యక్తిత్వం, సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆదివాసీ సమాజానికి ఆయన అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. కార్యక్రమంలో తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహస్వామి, ములుగు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తి రామస్వామి, పంబాపూర్ సర్పంచ్ ముక్తి శ్రీను, ముక్తి స్వామి, మంకిడి నరసమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్, నరసాపూర్ సర్పంచ్ యాప రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,



కార్యకర్తలు, ఆదివాసీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నాలి సమ్మయ్యకు నివాళులర్పించారు.

# సీఐ ఎడ్లపల్లి సతీష్‌కు ప్రెస్ క్లబ్-2 ఘన సన్మానం




**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

చిట్యాల: చిట్యాల మండల సీఐ ఎడ్లపల్లి సతీష్‌ను చిట్యాల మండల ప్రెస్ క్లబ్-2 అధ్యక్షులు శీలపాక ప్రణీత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కు ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రెస్ క్లబ్-2 సభ్యులు, చిట్యాల మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖకు, మీడియాకు మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఎడ్లపల్లి సతీష్ మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. పోలీసులు, పాత్రికేయులు పరస్పర సహకారంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. చిట్యాల మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్-2 ఉపాధ్యక్షులు జిడి సురేష్, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల ఓదెలు, సహాయ కార్యదర్శి గొర్రె అనిల్ యాదవ్, కార్యవర్గ సభ్యులు పాముకుంట్ల చందర్, జన్నె యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జి కొత్త పెల్లిలో సీలింగ్ భూములు సమగ్ర విషయాలు జరపాలి

**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)**

మండల పరిధిలోని జి కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 73 లో ఉన్న సీలింగ్ భూములకు సమగ్ర విచారణ జరిపి భూ యజమానులకు న్యాయం చేసి సమాన హక్కులు కల్పించాలని బి ఆర్ఎస్ జిల్లా నాయకులు జిలకర చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో జన్నారెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి నుండి కొన్న భూములను ఇంతవరకు పట్టాలు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇకనైనా జిల్లా అధికార యంత్రాంగం జి కొత్త పెల్లి గ్రామంలో సర్వేనెంబర్ 73 లో ఉండబడిన భూమిని అందరికీ సమాన పద్ధతిలో పంచి న్యాయం చేయాలని జిల్లా యంత్రాంగానికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
30 ఆదివారం ఆగస్టు 2026

# యువ క్రికెటర్లకు కార్పొరేట్ సంస్థలు అండగా నిలవాలి

**- బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వరినాథ్**

**- టీజీ20 విజేత 'హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్' జట్టుకు ఘన సన్మానం**



**హైదరాబాద్, ఆగస్టు 29:** దేశంలోని యువ క్రికెటర్లకు ఆర్థిక భరోసా, కెరీర్ భద్రత కల్పించడంతో పాటు గ్రామీణ స్థాయిలో మౌలిక వసతుల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు తోడ్పాటునందించాలని బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఆంధ్రా రంజీ కెప్టెన్ వి. చాముండేశ్వరినాథ్ పిలుపునిచ్చారు. బీసీసీఐ సహకారంతో నిర్వహించిన 'టీజీ 2026' క్రికెట్ టోర్నమెంట్‌లో ఛాంపియన్‌గా నిలిచిన 'హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్' జట్టుకు నగరంలోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది.

ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 మ్యాచ్‌లకు గాను 10 విజయాలు సాధించి టైటిల్ గెలుచుకున్న హైదరాబాద్ జట్టును, వారి టైటిల్ స్పాన్సర్ 'ట్రూజన్ సోలార్' సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో వి. చాముండేశ్వరినాథ్ మాట్లాడుతూ, యువ క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడంలో ట్రూజన్ సోలార్ కృషి ప్రశంసనీయమన్నారు. ప్రముఖ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ వంటి దిగ్గజాలు ఈ సంస్థలో పెట్టుబడిదారులుగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్ జట్టుకు మరో మూడేళ్ల పాటు స్పాన్సర్‌షిప్ కొనసాగించడంతో పాటు, భవిష్యత్తులో ఇతర క్రీడలకూ సంస్థ విస్తరించనుందని వెల్లడించారు.

ప్రతిభావంతులకు అండగా ఉంటాం:
ట్రూజన్ సోలార్ ఎండీ
ట్రూజన్ సోలార్ మేనేజింగ్ డైరెక్టర్ చారుగుండ్ల భవాని సురేష్ మాట్లాడుతూ.. "మీరు ఆడారు.. గెలిచారు.. ఛాంపియన్లుగా నిలిచారు" అంటూ ఆటగాళ్లను కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి అవసరమైన ఆర్థిక, మౌలిక సహాయాన్ని అందించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రూజన్ సోలార్ సీఈఓ జక్కుల శ్రీనివాస్, హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ కెప్టెన్ అభిజిత్ రెడ్డి, వైస్ కెప్టెన్ అజయ్ దేవ్ గౌడ్, జట్టు సభ్యులు మరియు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి,రైతు సంక్షేమం, మహిళల సాధికారత, పేదల సంక్షేమం లక్ష్యం ఎమ్మెల్యే జీఎస్సార్..

**భూపాలపల్లి క్యాంపు కార్యాలయం,29 ఆగస్టు 2026**



**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**
ఈరోజు శనివారం భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో గౌరవ భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు గారి సమక్షంలో చిట్యాల మండలంలోని బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన రామచంద్రాపూర్ సర్పంచ్ శ్రీమతి గాజా హేమలత అశోక్, కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోదారి ఓదెలు తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల ముఖ్య నాయకులు, సర్పంచులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి,రైతు సంక్షేమం, మహిళల సాధికారత, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని అన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు తమ గ్రామాల అభివృద్ధికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారి సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి భూపాలపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరపున స్వాగతం పలుకుతూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు ÷ కైలాపూర్ గ్రామానికి చెందిన ఉద్ధమారి కుమార్ ముదిగొండ నాగరాజు కనవేణి శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీలో చేశారు..
÷రాంచంద్రపురం గ్రామానికి చెందిన తోట దేవేందర్ క్యాతం రాజేందర్ ఆకుల మల్లయ్య ఆకుల సమ్మయ్య కాంగ్రెస్ పార్టీ లో చేశారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్, సర్పంచులు కర్రు లక్ష్మీ ప్రతాప్ రెడ్డి నక్క భాస్కర్ గుంటుపల్లి నాగమల్లేశ్వర్ కోడారి అశోక్ పర్లపెల్లి రవి మాజీ సర్పంచులు చిలుకల రాయకోమురు కామిడి రత్నాకర్ రెడ్డి మన్నెం శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీలు గుర్రపు సునీత తిరుపతి కట్కూరి పద్మ నరేందర్ టౌన్,గ్రామ శాఖ అధ్యక్షులు గంగాదరి రవీందర్ వేముల రాజుకుమార్ కంకణాల శంకర్ ఉపసర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు మద్దన నాగరాజు పార్టీ నాయకులు సిరిపురం కుమారస్వామి సింగిశాల మోహన్ రావు దబ్బెట రవి గాజె శంకరయ్య గాజె జనార్ధన్ అన్న రాజు పాసిగంటి మహేందర్ బుద్ధారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు....

# తెలుగు వెలుగులు పంచిన 'పెద్దబాలశిక్ష'

**- లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల పాఠశాలకు పుస్తకాల అందజేత**

**హనుమకొండ, ఆగస్టు 29 హైదరాబాద్ ఎస్టేట్:**

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినుల్లో మాతృభాషపై మక్కువ పెంపొందించడంతో పాటు ప్రాథమిక విజ్ఞానాన్ని విస్తరింపజేసే లక్ష్యంతో వరంగల్ కమిషనరేట్ హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు 'పెద్దబాలశిక్ష' పుస్తకాలను హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు అందజేశారు. సమాజ సేవలో భాగంగా స్వచ్ఛందంగా అందించిన ఈ పుస్తకాలను పాఠశాల గ్రంథాలయంలో అందుబాటులో ఉంచనున్నారు. తెలుగు భాషపై విద్యార్థినుల్లో ఆసక్తిని పెంచడంతో పాటు సాధారణ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు 'పెద్దబాలశిక్ష' ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పుస్తక పఠనం విద్యార్థుల జ్ఞానాన్ని విస్తరించడమే కాకుండా భాషా నైపుణ్యాలను మెరుగుపరుస్తుందని, ప్రతి విద్యార్థిని మాతృభాషపై మక్కువ పెంచుకుని పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని హెడ్ కానిస్టేబుల్ జయరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు కె. రమాదేవి, గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ బి. నరేందర్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థుల భాషా వికాసానికి తోడ్పడే ఉద్దేశంతో పుస్తకాలను అందించిన హెడ్ కానిస్టేబుల్ జి.



జయరాజును పాఠశాల సిబ్బంది అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

# బకాయిలివ్వకుంటే మంత్రుల ఇళ్ల ముట్టడి

**- వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం 12 గంటల నిరసన దీక్ష**

**- రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**

**వరంగల్, ఆగస్టు 29 హైదరాబాద్ ఎస్టేట్:**

రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపిస్తూ వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో 12 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్నట్లు తాము పేర్కొంటున్న రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల విడుదలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకుంటే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రుల ఇళ్లను పెద్ద ఎత్తున ముట్టడిస్తామని నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. నిరసన దీక్షలో వరంగల్ జిల్లా బీజేపీ



అధ్యక్షుడు గంట రవి కుమార్, కనుకుంట్ల రంజిత్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌తో పాటు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట వివరాలు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు

**- డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతం చేయాలి.. రైతులు సహకరించాలి : ఏఓ హరి ప్రసాద్‌బాబు**

**గీసుగొండ, ఆగస్టు 29 హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంట నష్టపరిహారం, మద్దతు ధర తదితర ప్రయోజనాలు రైతులకు సకాలంలో అందాలంటే పంటల వివరాల నమోదు తప్పనిసరని మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్‌బాబు తెలిపారు. గీసుగొండ మండలంలో కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే పనులను శనివారం మాచాపూర్, మొగిలిచర్ల గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి రైతు తాను సాగు చేసిన పంట వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట వివరాల నమోదు ఆధారంగానే వివిధ ప్రభుత్వ పథకాలు, పంట నష్టపరిహారం, మద్దతు ధర తదితర ప్రయోజనాలు రైతులకు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ పంట వివరాలను అధికారులకు అందించి, ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. గీసుగొండ మండలంలో డిజిటల్ క్రాప్ సర్వేకు మొత్తం 31,327 ప్లాట్లు కేటాయించగా, ఇప్పటివరకు 814 ప్లాట్లలో 2.6 శాతం సర్వే పూర్తయిందని హరి ప్రసాద్‌బాబు తెలిపారు. ప్రస్తుతం మొగిలిచర్లలో 21.2 శాతం, వంచనగిరిలో 7.6 శాతం, బొడ్డుచింతలపల్లెలో 3.3 శాతం సర్వే పూర్తయిందని వివరించారు. మిగిలిన గ్రామాల్లోనూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మొగిలిచర్లలో డిజిటల్ క్రాప్ సర్వే సర్వేయర్ అచ్చ వర్షిత్ క్షేత్రస్థాయిలో పంట వివరాలను నమోదు చేస్తుండగా, మాచాపూర్‌లో రైతు పత్తిపాక నారాయణ వరికి బదులుగా పెసర, కూరగాయలు సాగు చేస్తున్నట్లు



అధికారులు తెలిపారు. పంటల వివరాలను క్షేత్రస్థాయిలో సరిగ్గా నమోదు చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పర్యవేక్షణలో ఏఈఓ బల్లు భరత్, డీసీఎస్ సర్వేయర్ అచ్చ వర్షిత్, రైతులు ఎద్దు శ్రీను, పత్తిపాక నారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# గంగదేవిపల్లి పాఠశాలకు సోషల్ టీచర్‌ను నియమించాలి

## - పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం..

## - అధికారులకు ఫిర్యాదు చేసిన రేవంత్ రాథోడ్

**గీసుగొండ, ఆగస్టు 29 హైదరాబాద్ ఎస్టేట్:**

జాతీయస్థాయిలో ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గంగదేవిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడి కొరతపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు రేవంత్ రాథోడ్ తెలిపారు. సమాజ సేవకులు అల్లం స్వప్న బాల కిషోర్‌రెడ్డి సూచనల మేరకు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. 202627 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు లేకపోవడంతో ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఆ సబ్జెక్టు సిలబస్ బోధన ప్రారంభం కాలేదని రేవంత్ రాథోడ్ పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం అత్యంత కీలకమైన సమయంలో ప్రధాన సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఉపాధ్యాయ నియామకంలో మరింత జాప్యం జరిగితే విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం తెలంగాణ పాఠశాల విద్యా ఫిర్యాదుల వ్యవస్థలో




ఇప్పటికే అధికారికంగా ఫిర్యాదు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు సంఖ్య 202608276359 అని పేర్కొన్నారు.

సీఎంఓ, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు, విద్యాశాఖ కార్యదర్శి, ఆర్‌జేడీ వరంగల్, వరంగల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి తదితరుల దృష్టికి కూడా సమస్యను అధికారికంగా తీసుకెళ్లినట్లు వివరించారు.

అధికారికంగా ఫిర్యాదు చేయడంతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా కూడా సమస్య తీవ్రతను ప్రజలు, అధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల రేవంత్ రాథోడ్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక ఉపాధ్యాయుడి నియామకానికి ఇంత ఆలస్యం ఎందుకు? పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు నష్టపోయే వరకు ఎందుకు వేచి చూడాలి?" అని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గంగదేవిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిని నియమించాలని రేవంత్ రాథోడ్ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు సకాలంలో బోధన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక hyderabadestate.co.in
30 ఆదివారం ఆగస్టు 2026

# విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ చేయూత

## - గొర్రెకుంట పాఠశాలల్లో ఉచిత యూనిఫాంలు, షూస్ పంపిణీ

## - విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

## ఎంఈఓ ఎస్. రవీందర్

**గీసుగొండ, ఆగస్టు 29 హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గీసుగొండ మండల విద్యాశాఖాధికారి ఎస్. రవీందర్ విద్యార్థులకు సూచించారు. గొర్రెకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, షూస్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ ఎస్. రవీందర్ సమక్షంలో విద్యార్థులకు యూనిఫాంలు, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో ప్రతిభ కనబరచాలని కోరారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా కష్టపడి చదవాలని, భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుని కుటుంబంతో పాటు పాఠశాలకు కూడా మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు



ఎన్. జ్యోతిర్మయి, బి. లక్ష్మి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఓ ఎ. రజిత, ఆర్పీ జన్ను నిర్మల, కోట అరుణ, ఉపాధ్యాయులు మార్త శ్రీనివాస్, సీహెచ్. అనిత, మంద ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మాలల హక్కుల కోసం మహా ఉద్యమం

## - 31న "హలో మాల.. చలో సెక్రటేరియట్" - విద్య, ఉద్యోగ రంగాల్లో అన్యాయానికి చెక్ పెట్టాలి

## - రోస్టర్ విధానాన్ని సవరించాలని ప్రభుత్వానికి డిమాండ్ -ప్రతి మాల కుటుంబం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలి

## - డా. అల్లిబిల్లి మహేందర్

మాలల హక్కుల పరిరక్షణ, విద్యా, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను నివారించడంతో పాటు రోస్టర్ విధానాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న "హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ ఉత్సవాల కమిటీ కో-చైర్మన్, జాతీయ మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డా. అల్లిబిల్లి మహేందర్ తెలిపారు.
మాలలకు విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత న్యాయం జరగాలంటే ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ విధానంపై ప్రభుత్వం సమగ్రంగా పునఃపరిశీలన చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మాలలకు అందాల్సిన అవకాశాలు, హక్కులు ఎలాంటి వివక్షకు తావులేకుండా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**హక్కుల కోసం ఐక్యంగా ముందుకు**

జాతీయ మాల మహానాడు తెలంగాణ అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు "హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డా. అల్లిబిల్లి మహేందర్ వెల్లడించారు. మాల సమాజానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, తమ హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో గళం వినిపించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.
విద్యా రంగంలో విద్యార్థులకు సమాన అవకాశాలు, ఉన్నత విద్యలో అవకాశాలు, ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం వంటి అంశాలపై మాల సమాజంలో విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కదలాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

**ప్రతి మాల కుటుంబం నుంచి భాగస్వామ్యం**

31న జరిగే కార్యక్రమానికి ప్రతి మాల కుటుంబం నుంచి విద్యార్థులు, యువత, పెద్దలు, మహిళలు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావాలని డా. మహేందర్ పిలుపునిచ్చారు. ఇది కేవలం కొంతమంది నాయకుల కార్యక్రమం కాదని, మాల సమాజ భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై జరిగే ఉద్యమ కార్యక్రమమని ఆయన అన్నారు.
ప్రస్తుత తరంలో విద్యార్థులు, యువత తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, సమాజ సమస్యలపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. రాబోయే తరాలకు మెరుగైన విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే ఇప్పటి నుంచే హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**రోస్టర్ విధానంలో మార్పులు చేయాలి**

విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయాలను నివారించేందుకు రోస్టర్ విధానాన్ని ప్రభుత్వం సమీక్షించి, అవసరమైన మార్పులు చేయాలని డా. అల్లిబిల్లి మహేందర్ డిమాండ్ చేశారు.
సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణకు అనుగుణంగా విధానాలు ఉండాలని అన్నారు. మాల సమాజానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**యువత కీలక పాత్ర పోషించాలి**

సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మాల యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని డా. మహేందర్ అన్నారు. విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని కోరారు.
మాల సమాజంలోని ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక్కరు అయినా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా న్యాయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

**సెక్రటేరియట్ ముట్టడికి భారీ సన్నాహాలు**

"హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, యువత ఇప్పటికే సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి మాల సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.
మాలల సమస్యలు, హక్కులు, విద్యా, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన అంశాలను ప్రభుత్వానికి బలంగా వినిపించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవాలని నాయకులు ఆకాంక్షిస్తున్నారు.

మాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, 31న జరిగే "హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డా. అల్లిబిల్లి మహేందర్ కోరారు.
"మన హక్కులు.. మన భవిష్యత్తు.. మన పోరాటం" మాల సమాజం ఐక్యతను చాటి, విద్యా, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు సాధించే దిశగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
జై భీమ్..!లిజై మాల..!

# గ్రామ న్యాయాలయాల ఏర్పాటుతోనే సామాన్యుడికి సత్వర న్యాయం

## : న్యాయవాది, జేఏసీ కన్వీనర్ నర్సింగరావు

## - పెండింగ్ కేసుల భారం తగ్గించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి

## - న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తి పరిరక్షణ ప్రజాస్వామ్యానికి కీలకం

**హనుమకొండ, ఆగస్టు 29**

దేశ వ్యాప్తంగా పెరుగుతున్న పెండింగ్ కేసులకు శాశ్వత పరిష్కారం చూపాలంటే గ్రామస్థాయిలోనే న్యాయ సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని సీనియర్ న్యాయవాది, ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ కన్వీనర్ రామగొని నర్సింగరావు అభిప్రాయపడ్డారు. గ్రామ న్యాయాలయాల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం నిర్దేశించిన చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా అనే నాలుగు ప్రధాన స్తంభాలు స్వతంత్రంగా, పరస్పర గౌరవంతో పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.
ప్రస్తుతం వాణిజ్య, కుటుంబ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వ (మిడియేషన్) విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో, న్యాయస్థానాల ప్రాధాన్యత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివాదాల పరిష్కారంలో న్యాయవ్యవస్థ పాత్ర మరింత బలోపేతం అయ్యేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.
గ్రామ న్యాయాలయాల ఏర్పాటు అంశాన్ని కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రకటించినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికి న్యాయం చేరాలంటే గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేసి, అందులో



న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ న్యాయవాదులు, అవసరమైన సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. దీంతో కేసుల పరిష్కారం వేగవంతమవడంతో పాటు, గ్రామీణ ప్రజలకు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.
మధ్యవర్తిత్వ విధానానికి సంబంధించిన ప్రస్తుత చట్టాలను సమీక్షించి, న్యాయస్థానాల స్వయం ప్రతిపత్తిని కాపాడేలా తగిన మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన నర్సింగరావు, గ్రామ న్యాయాలయాల ఏర్పాటు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు.

# జలుబు విడవదు - జ్వరం జారదు

## : నగరం లో పంజా విసురుతున్న ' స్వైన్ ఫ్లూ ' కేసులు

**హైదరాబాద్ :ఆగస్టు 30:(అశోక్ గౌడ్ పొట్లపల్లి )**



దేశంలో హెచ్1ఎన్1 (స్వైన్ ఫ్లూ) కేసులు వేగంగా పెరుగుతుండటం కలకలం రేపుతుండగా ఇప్పుడు గ్రేటర్ వ్యాప్తంగా ఫ్లూ (ఇన్ఫ్లూయెంజా ) తో పాటు స్వైన్ ఫ్లూ కేసులు కూడా పెరుగుతున్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు కాని అప్రమత్తంగా ఉండటం మేలని సీనియర్ హోమియోపతి వైద్యుడు డా. జి. దుర్గాప్రసాద్ రావు తెలిపారు. వర్షాలు పడుతుండటం వల్ల , వాతావరణం లో తేమ పెరిగి వైరస్ ల వ్యాప్తికి వాతావరణం అనుకూలంగా ఉందని , సాధారణ ఫ్లూ లక్షణాలతో పాటు తీవ్రమైన జ్వరం, వణుకు, పొడిదగ్గు, గొంతునొప్పి, విపరీతమైన కండరాల నొప్పులు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే ఇవి స్వైన్ ఫ్లూ గా అనుమానించాలని , పిల్లల్లో అయితే వాంతులు, విరేచనాలు కూడా ఉంటాయని , శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండెల్లో నొప్పి, పెదవులు లేదా వేళ్లు నీలంగా మారడం, ఉమ్మితో రక్తం పడటం, తీవ్రమైన మగత లేదా మూర్ఛ వంటి తీవ్ర లక్షణాలు ఉంటే అశ్రద్ధ చెయ్యకుండా డాక్టర్ ని సంప్రదించడం లేదా ఆస్పత్రి లో చేర్పించి అత్యవసర వైద్యం అందించాల్సి ఉంటుందని డా. రావు సూచిస్తున్నారు.

**సొంతంగా మందులు వాడితే ప్రాణాలకే ప్రమాదం!**

వైరల్ ఇన్ఫెక్షన్ల బారిన పడినప్పుడు చాలామంది మెడికల్ షాపులకు వెళ్లి సొంతంగా యాంటీబయోటిక్స్ కొనుగోలు చేసి వాడుతుంటారు. కాని హెచ్1ఎన్1 ( స్వైన్ ఫ్లూ ) ప్రమాదకర వైరస్ వల్ల వచ్చే వ్యాధి అని, దానిపై యాంటీబయోటిక్స్ పనిచేయవని , అజిత్రోమైసిన్, అమోక్సిసిలిన్ వంటి యాంటీబయోటిక్స్ లాంటివి వాడితే శరీరంలోని మంచి బ్యాక్టీరియా నశించి 'యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్' అనే ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుందని ,డాక్టర్లు సిఫార్సు చేస్తే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత వైద్యం జోలికి వెళ్లవద్దని డా. దుర్గాప్రసాద్ రావు హెచ్చరిస్తున్నారు.

**జాగ్రత్తలు తప్పనిసరి!**

వైరస్ సోకినప్పుడు దగ్గు , తుమ్ముల ద్వారా ఒకరినుండి ఇంకొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఇతరులకు సంక్రమించకుండా జాగ్రత్తలు తప్పనిసరి.

తరచూ శుభ్రంగా చేతులు కడుక్కోవడం లేదా శానిటైజర్‌ను ఉపయోగించడం , దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు టిష్యూతో లేదా వంగిన మోచేతితో నోరు, ముక్కును కప్పుకోవడం ద్వారా శ్వాసకోశ పరిశుభ్రతను పాటించాలని , రద్దీగా ఉండే చోట మరియు గాలి వెలుతురు సరిగా లేని మూసి ఉన్న ప్రదేశాలలో మాస్క్ ధరించాలని , జలుబు , జ్వరం ఉన్న వాళ్ళు బయట తిరగకుండా విశ్రాంతి తీసుకోవాలని డా. రావు సూచిస్తున్నారు. చిన్న పిల్లలు , గర్భిణీ స్త్రీలు , వృద్ధులు , దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిలో రోగనిరోధక శక్తి బలహీనంగా ఉండి వీరిపై వైరస్ తీవ్ర ప్రభావం చూపుతుందని , ఎవరైనాసరే సమతుల్య ఆహారం తీసుకుంటూ , కాచి చల్లార్చిన మంచినీరు త్రాగుతూ , తేలికపాటి వ్యాయామం చేస్తూ తగినంత నిద్ర ఉండేటట్లు చూసుకుంటే వైరస్ అంత తేలికగా సోకదని డా.దుర్గాప్రసాద్ రావు చెప్తున్నారు.

**సీజనల్ జ్వరాలకు హోమియోపతి చికిత్స ఒక వరం**

వర్షాకాలంలో వచ్చే జ్వరాలు తదితర సమస్యలకు హోమియోపతి వైద్యం ఒక వరం లాంటిదని యాంటీబయోటిక్స్ , పెయిన్ కిల్లర్స్ వాడకుండా హోమియో మందులు సమర్థవంతంగా పని చేస్తాయని చిన్న , పెద్ద , స్త్రీలు , వయోవృద్ధులు ఎవరైనా సరే ఎటువంటి దుష్ఫలితాలు ప్రభావం చూపకుండా సత్వర నివారణ కు హోమియో ఔషధాలు ఉపయోగపడతాయని డా.దుర్గాప్రసాద్ రావు తెలియపరుస్తున్నారు. దీర్ఘకాలిక జబ్బులతో చికిత్స పొందుతున్నవారు , గుండె , , ఊపిరితిత్తులు , లివర్ , కిడ్నీ , క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులకు చికిత్స పొందుతున్నవారు కూడా సంకోచం లేకుండా హోమియో మందులు వాడవచ్చుని, ఇతర దీర్ఘ వ్యాధులకు చికిత్స పొందుతున్నవారికి కూడా తాత్కాలికంగా వచ్చిన సీజనల్ అనారోగ్యానికి హోమియోపతి మందులు సహాయక చికిత్సలా ఉపయోగపడతాయని, ఎక్కువకాలం హోమియో మందులు వాడుకున్న నష్టమేమీ ఉండదని , హోమియో మందులు రోగనిరోధకశక్తిని పెంచడానికి ఉపయోగపడుతూ , వ్యాధి నిరోధకంగా కూడా పనిచేస్తాయని డా.రావు వివరించారు. రోజూ ముగ్గురు , నలుగురు ఫ్లూ తరహా లక్షణాలతో క్లినిక్ కు వస్తున్నారని , వాళ్లకు హోమియో వైద్యంతో పూర్తిగా రిలీఫ్ వస్తుందని డా. దుర్గాప్రసాద్ రావు చెప్తున్నారు.ఐ

# మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకుల భరోసా

## సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్

### 20,000/- రూల ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ నేతలు

### సింగల్ విండో చైర్మన్ గంపా వెంకటేష్ గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

**హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**



కడ్తాల్ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కాశమోని జంగయ్య, దేరంగుల రాములు కుటుంబాలను సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహా రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కంబాల పరమేష్ మరియు పలువురు బిఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అదేవిధంగా మృతుల కుటుంబాలకు గంపా వెంకటేష్ గుప్తా ఇరువురు కుటుంబాలకు 5,000/- చొప్పున 10,000/- రూపాయలు, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి 5,000/- చొప్పున 10,000/- రూపాయలు మొత్తం 20,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ ఎవరికి ఏ ఆపద వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని తెలిపారు. పదవులు ఉన్నా, లేకున్నా ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణ, మంగలపల్లి నర్సింహ, లయక్ అలీ, కేశని బుచ్చయ్య,గురిగళ్ల రామచంద్రయ్య,మూఢ బాలరాజ్,మూఢ అశోక్,కేశని మహేష్,బోసు వెంకటేష్,సిద్దిగారి వెంకటేష్,అంజి కంబలపల్లి, రమేష్, రాయికంటి సురేష్, రాజు,రాఘవ,శ్రీకాంత్,సాయి తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
30 ఆదివారం ఆగస్టు 2026

# విద్యార్థులకు పండ్ల పంపిణీ

## - మాతృమూర్తి వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం



గీసుకొండ, ఆగష్టు 29 హైదరాబాద్ ఎస్టేట్: గ్రామానికి చెందిన శ్రీమంతుడు, పాఠశాల అభివృద్ధి ప్రదాత పెగళ్ళపాటి లక్ష్మినారాయణ సార్ మాతృమూర్తి స్వర్గీయ పెగళ్ళపాటి కమలమ్మ రాఘవరావు వర్ధంతిని పురస్కరించుకుని గీసుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. మాతృమూర్తి జ్ఞాపకార్థం విద్యార్థుల పట్ల ఆప్యాయత చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం పాఠశాలల్లో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పండ్లను పంపిణీ చేయడం పట్ల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నమ్రతతో పాటు ఉపాధ్యాయులు పద్మ, అరుణశ్రీ, వెంకట్రావు, శ్రీనివాస్, రవిచందర్, సబిత, కళ్యాణి తదితరులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమకొండలో సెప్టెంబర్ 4వ తేదీన శ్రీకృష్ణాష్టమి వేడుకలు.



**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**
**ఇఖ్వ: 29.08.2026**

కూడా మాజీ చైర్మన్, యాదవ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గొల్ల,కురుమల సమక్షంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించిన సుందర్ రాజ్ యాదవ్ యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ప్రెస్ మీట్ కామెంట్స్: ప్రతీ ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నాం యాదవ వంశానికి చెందిన శ్రీకృష్ణ భగవానుని వేడుకలు జరుపుకోవడం మా అదృష్టం. ప్రపంచ వ్యాప్తంగా శ్రీకృష్ణుని భజనలు జరుగుతున్నాయి భగవద్గీత ప్రపంచానికి మార్గదర్శిగా మారింది అన్ని దేశాల్లో భగవద్గీత పఠనం జరుపుతున్నారు సెప్టెంబర్ 4న గొల్ల, కురుమలతో కలిసి వైభవంగా వేడుకలు నిర్వహిస్తాం. కాళోజీ కళాక్షేత్రంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు ఉంటాయి పార్టీలకు అతీతంగా వేడుక ఉంటుంది మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి,స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరవుతారుశ్రీకృష్ణ తత్వాన్ని ప్రజలు అలవర్చుకోవాలి.సెప్టెంబర్ 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు రథయాత్ర.రాంనగర్ నుండి కాళోజీ కళాక్షేత్రం వరకు రథయాత్ర జరుగుతుందిఅనంతరం పవిత్రమైన గోవుల పూజ కార్యక్రమంశ్రీకృష్ణ భగవానుని పూజ...తొట్లు ఊపే కార్యక్రమం.యాదవ సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే కార్యక్రమాలు.కళాకారుల ఆటా, పాట.అన్ని కులాలను ఈ వేడుకలకు ఆహ్వానిస్తున్నాం. శ్రీకృష్ణ పరమాత్ముడు అందరికీ మార్గదర్శి.ఆయనను మనసులో నింపుకుని వేడుకలను విజయవంతం చేస్తాం.అందరి జీవితాలు సుఖ సంతోషాలతో, భగవంతుని ఆశీస్సులతో నిండాలని కోరుతున్నాం.దేశవ్యాప్తంగా ఉన్న యాదవులను ఏకం చేసి రాబోయే రోజుల్లో వేడుకలు నిర్వహిస్తాం.మన కుటుంబ విలువలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి.సమాజంలో భక్తిభావం, మంచిమార్గంలో నడిచేలా ప్రజలను నడిపించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తాం: సుందర్ రాజ్ యాదవ్

# సూర్యవంశీ కురీల్ సమాజ్ ప్రతిష్ఠను దిగజార్చుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

## - సంఘం భవనాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు
## - బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా నిర్లక్ష్యం
## - చైర్మన్ బోజరాజు చౌదరి, అధ్యక్షుడు పాపాలాల్

**హైదరాబాద్, ఆగస్టు 29:** సూర్యవంశీ కురీల్ సమాజ్ (మోచీ) పేరును దుర్వినియోగం చేస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ సంఘం ప్రతిష్ఠను దిగజారుస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సమాజ్ చైర్మన్ బోజరాజు చౌదరి, అధ్యక్షుడు పాపాలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చుడీబజార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చుడీబజార్‌లోని సూర్యవంశీ కురీల్ సమాజ్ (రిజిస్టర్ నం. 391/2024, భవన నం. 14-8-73/1) పూర్తిస్థాయి కార్యవర్గంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. అయితే, స్థానికులైన రాహుల్ టోడ్కర్, హరీష్, అశోక్, చంద్ర ప్రకాష్, రమేష్, నందు, నవేలక, మీనా, శాంతా, రాజేశ్వరి, సరస్వతి, మంగ్లాలు ఒక ముఠాగా ఏర్పడి గత రెండేళ్లుగా సంఘం తమదేనంటూ కార్యవర్గ సభ్యులను లోపలికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.దీనిపై ప్రశ్నించినందుకు జియాగూడ, ధూల్‌పేట్ ప్రాంతాల నుంచి రౌడీ మూకలను రప్పించి తమపై భౌతిక దాడులకు దిగడమే కాకుండా, చంపేస్తామంటూ ప్రాణ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన ద్వారానికి తాళం వేసి, వెనుక గేటు గుండా ప్రవేశిస్తూ భవనంలో మద్యం సేవించడం, జూదం ఆడడం లాంటి చట్టవ్యతిరేక పనులు చేస్తూ సంఘ పవిత్రతను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు.ఈ అక్రమాలపై గోషామహల్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించగా, ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్‌కు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని వారు గుర్తుచేశారు. ఇప్పటికైనా



ఉన్నతాధికారులు స్పందించి సంఘాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరారు.ఈ సమావేశంలో సమాజ ఉపాధ్యక్షుడు చందన్‌లాల్, జాయింట్ సెక్రటరీ రమేష్ రవి, కోశాధికారి సోమనాథ్ రవి, కార్యవర్గ సభ్యులు రవి జగదీష్, పరదేశీ పీతాంబర్ తదితరులు పాల్గొన్నారు.

# జీ తెలుగు సరిగమప వేదికపై భూపాలపల్లి బిడ్డ అశ్వినీ రాథోడ్ సత్తా

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

భూపాలపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ గాయని అశ్వినీ రాథోడ్ తన అద్భుతమైన గాన ప్రతిభతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇటీవల జీ తెలుగులో ప్రసారమవుతున్న 'సరిగమప' మెగా లాంచ్ కార్యక్రమంలో అశ్వినీ రాథోడ్ తన గాత్రంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.
'రేలారే రేలారే నీళ్లల్లో నిప్పల్లే', 'ఊరు పల్లెటూరు' వంటి పాటలను తనదైన శైలిలో ఆలపించి ప్రేక్షకులను అలరించారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ యువ గాయని ప్రతిష్టాత్మక వేదికపై తన ప్రతిభను చాటుకోవడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
అశ్వినీ రాథోడ్ ప్రతిభను ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి ప్రశంసించడం ఆమెకు మరింత ప్రోత్సాహాన్ని అందించింది. ఇప్పటికే సంగీత, సినీ రంగాల్లో భూపాలపల్లి జిల్లాకు చెందిన పలువురు



ప్రతిభావంతులు తమదైన ముద్ర వేశారు. ప్రముఖ గేయ రచయిత ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, సినీగేయ రచయిత నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్, బండి సత్యం, చైతన్య తదితరులు సినిమా రంగంలో జిల్లాకు మంచి పేరు తీసుకొస్తున్నారు.
అదే బాటలో అశ్వినీ రాథోడ్ కూడా తన గాన ప్రతిభతో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, సినీ నేపథ్య గాయనిగా రాణించాలని భూపాలపల్లి జిల్లా ప్రజలు



ఆకాంక్షిస్తున్నారు. రానున్న రోజుల్లో ఆమెకు మరిన్ని మంచి మంచి సినిమాల్లో సినీ గాయనిగా అవకాశాలు లభించి, తెలుగు సినీ సంగీత రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.
భూపాలపల్లి గడ్డ నుంచి మరో ప్రతిభావంతురాలు సంగీత ప్రపంచంలో వెలుగొందుతుండటం జిల్లాకు గర్వకారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సీలింగ్ భూములకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి

**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)**

రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములన్నిటీని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూ ఆసాములకు పట్టాలు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.శనివారం అయన సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు సంబంధించి దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉన్న 15 గ్రామాల లోని 1061 మంది రైతులకు
1044 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు ఏళ్ళ తరబడిగా పట్టాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, దాని ద్వారా వివాద రహిత భూములన్నింటికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తాతలనాటి నుండి వస్తున్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం చేస్తున్నామన్నారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి నిజమైన ఆసాములకు హక్కు పత్రాలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతన 70 గ్రామాలను ఎంపిక చేసుకొని సర్వే చేయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతుండడం తమ దృష్టికి వచ్చిందని,వీటిని అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రానున్న సంవత్సరకాలంలో ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తామని, వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని పునరుద్ఘాటించారు. పంచాయతీలేని భూములకు, భూములున్న ఆసాములు అందరికీ పట్టాలిస్తామన్నారు.
గత ప్రభుత్వం 8 లక్షల ఇరవై ఒక్క వేల కోట్ల అప్పును తమ ప్రభుత్వం పై మోపినప్పటికీ తల తాకట్టు పెట్టైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అపకూడదన్నదే తమ ఉద్దేశమని, సంక్షేమ కార్యక్రమాలు కుంటు పడకుండా తమ ప్రభుత్వం అమలు చేస్తున్నదని, అందులో భాగంగానే రైతులకు కూడా న్యాయం చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు ఇవ్వలేదని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నదని అన్నారు.
గడచిన రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో మహిళలకు 63 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని, రానున్న రెండున్నర ఏళ్లలో కూడా అంతే రుణాలు ఇస్తామని ,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత తమదేనని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జనం బ్రహ్మ రథంపడుతున్నారని,హైద్రాబాద్ లో కోట్ల రూపాయల విలువచేసే భూములలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి మొదటి విడత,3500,రెండో విడత 2000 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, మూడవ ,నాలుగో విడతల్లో కూడా ఇస్తామని, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి వెల్లడించారు .
రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల




మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల రైతుల సమస్యలకు పరిష్కారం పట్టాలు ఇవ్వడమని అన్నారు. భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని, రైతులకు రైతు భరోసా, రైతుబంధు, భీమా, ఇతర లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 5 లక్షల రూపాయలు ఇచ్చిన దాఖలాలు లేవని, రాష్ట్రవ్యాప్తంగా 36వేల కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లను నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి 100 కోట్ల రూపాయలతో రోడ్లు మంజూరు చేయడం జరిగిందని, మరో 200 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే సూర్యాపేట నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లను వేస్తామని తెలిపారు. ప్రజలకు సన్నబియ్యం, రైతు భరోసా, రైతుబంధు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లను ఎట్టి పరిస్థితులలో ఆపమని, గుడిసె ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి గుడిశలేని తెలంగాణగా మారుస్తామని అన్నారు.
భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన అని,గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కానీ రైతుల సమస్యలు పట్టాల పంపిణీతో ఇప్పుడు పరిష్కారం అయ్యాయని, తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, ప్రజలు వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ పొలాలను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేనందువల్ల ఎన్నో బాధలకు గురయ్యారని, అలాంటి 60 సంవత్సరాల సమస్య తీర్చినందుకు రెవెన్యూ మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. పట్టాల పంపిణీతో రైతులు వారి భూములకు హక్కుదారులు అయ్యారని, గతంలో కేంద్రంలో ఉన్న తమ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత తమకే దక్కిందని, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని, భూమి అనేది రైతుకు ఆత్మ గౌరవం అని ,భూమి హక్కు లేకుంటే గుర్తింపు ఉండదని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న రోడ్లను మంజూరు చేయాలని, తుంగతుర్తి నియోజకవర్గానికి అదనంగా ఇండ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.
జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ దేశంలో సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత కూడా అంతకుముందు ఉన్న వివిధ కారణాలవల్ల పట్టాలు రాని వారు రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు వంటివి రాక అనేక ఇబ్బందులు పడ్డారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వీటి పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇందులో భాగంగా నూతనకల్ మద్ధిరాల మండలాలలోని 15 గ్రామాలలో 3000 ఎకరాలకు పైగా భూములన్ని సర్వే చేసి పరిశీలించి రైతుల పొలాల వద్దకు వెళ్లి వారికి నోటీసులు ఇచ్చిన పిదప ముసాయిదా అర్హుల జాబితాను ప్రకటించడం జరిగిందని , సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడం జరుగుతున్నదని ,ఈ రెండు మండలాలలో 1060 మంది రైతులకు 1044 ఎకరాలకు పట్టాల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు భూభారతి కింద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇస్తున్నామని, ఖాతాలు లేని వారికి కూడా కొత్తగా ఖాతాలు ఇస్తున్నట్టు వెల్లడించారు.
రాష్ట్ర రెవెన్యూ,సిసి ఎల్ ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వీస్ సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ ,ఆర్డీవోలు, తహసిల్దారులు, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.